# పేగుబంధం

టాక్సీ హైదరాబాదు ఏర్‌పోర్టు శంషాబాదు నుంచి క్రిష్టారెడ్డి సొంత ఊరు సంగిగూడెం వైపు దూసుకుపోయింది. వెనుకసీట్లో కూర్చున్న క్రిష్టారెడ్డి బయటికి కుడివైపు ఎడమవైపు చూస్తున్నాడు. ఇరవై గంటల ప్రయాణం! అలసటగా వుంది. అయినా ఆసక్తిగా చూస్తున్నాడు. "రోడ్డు నున్నగా బాగుంది!" అని క్రిష్టారెడ్డి దేశం అభివృద్ధిని అంచనా వేసుకున్నాడు. ఆ పక్క సందులోనే వున్న రోడ్ల అధ్వాన్న స్థితి చెత్తకుప్పల నతడు చూడలేదు. రోడ్డుకు అటుయిటు వున్న ఆకాశహర్మ్యాలను దుకాణాలను చూసి నోరు తెరిచాడు క్రిష్టారెడ్డి. పి.వి.ఎక్స్‌ప్రెస్ దిగి కారు బేగంపేట ప్రవేశించింది. "అబ్బో! ఎంత పెద్ద దుకాణాలు... షాపర్స్ స్టాప్... లైఫ్ స్టైల్... జాయింట్ మాల్... ఫుడ్ వరల్డ్... భీమ్‌జీ ఝువేరి డయమండ్స్..." అబ్బో! మస్తు దుకాణాలు! అందరూ డబ్బు గలోళ్ళే!... లేకపోతే ఇన్ని దుకాణాలు ఎట్ల బతుకుతయి!..." టాక్సీ సంగిగూడెం వైపు దూసుకుపోతున్నది.

"డ్రైవర్! యీ ఎత్తుగ బ్రిడ్జి యేంది. మునుపులేవుగివి!" అడిగాడు.

"ఫ్లై ఓవర్లు సార్! పట్నంల శాన దిక్కుల ఫ్లై ఓవర్లు ఒచ్చినయి. అగో గా కనపడేది లోకల్ ట్రెయిన్ స్టేషన్. ఎలక్ట్రిక్ రైలు. ఇగ రోడ్ల మీద రద్దీ తక్కువైతది. గాని మా అసొంటి టాక్సీ ఆటోలకు గిరాకీ యేమైతదో గా రైలు తోటి!..." డ్రైవర్ గొంతులో నైరాశ్యం. కారు మినిస్టర్ రోడ్డులో దూసుకుపోతున్నది.

"అగో సార్! గదే నెక్లెస్ రోడ్... అటుపక్క ఎన్‌టిఆర్ గార్డెన్... సమాధి..." టాక్సీడ్రైవర్ ఉత్సాహంగా పరిచయం చేస్తున్నాడు. కుడి పక్క హుసేన్ సాగర్ అరుణోదయం వెలుగులో మిలమిల మెరిసిపోతున్నది" "పచ్చటి లాన్లు... చెట్లు... అంతా పచ్చగా పరిశుభ్రంగా అందంగా కన్పిస్తున్నది. గిదంత అభివృద్ధికి గుర్తు కాదా?..." క్రిష్టారెడ్డి పరిసరాల అందానికి ముగ్ధుడయ్యాడు.

టాక్సీ దూసుకుపోతున్నది.

అంబర్‌పేట దాటి మూసారాంబాగ్ ప్రవేశించింది. ఒక్కసారే గుప్పుమని దుర్గంధం! క్రిష్ణారెడ్డి పేపర్ కర్చీఫ్ తీసి ముక్కు మూసుకున్నాడు. టాక్సీ అద్దాలన్నీ మూసివున్నా దుర్గంధం ఆగలేదు.

"ఏం వాసనోయ్ గిది!"

"వానల్లేవు గదసార్! వాసన ముసురుకుంటున్నది. మరి ఊర్ల నుంచి కూలినాలికని బతకవచ్చిన జనమంత గీ నాలాలోకే నాయె! వాసన రాక ఏమొస్తది!" డ్రైవర్ ముఖం మీద చిరునవ్వు.

"నాలా అంటవేంది గది మూసీనది కాదా?"

"నది యేడుంది సార్. వానల్లేక గది నాలా లెక్కనే అయింది." డ్రైవర్ వెటకారం.

"ప్రజలకు బొత్తిగ ఆరోగ్యం గురించి పరిశుభ్రత గురించి ఆలోచన లేదు! ఒక్కరిద్దరు ఎంతకని పరిస్థితిని మారుస్తరు. అందర్లో చైతన్యం రావాలె!" క్రిష్ణారెడ్డి స్వగతంలాగానే అన్నాడు.

"ఏం మార్చేంద్రు సార్! పల్లెటూర్లు పాడుబడ్తుంటె మంది బతుకుదెరువుకని పట్నంకు ఎగబడ్తుండ్రు. వాళ్ళ తప్పేముంది సార్! తమ బతుకుబాట తాము చూసుకుంటుండ్రు! గిక్కడ్నె గింత పని దొర్కబట్టె. చారెడు నీళ్ళు బుక్కెడు కూడు కోసం మంది రాబట్టిరి. ఇగ వాళ్ళెక్కడుంటరు ఒచ్చి! రోడ్డుమీద గుడిసెల్ల కాపురం! మళ్ళ వాసన రాకుంటె ఏమొస్తది సార్!" డ్రైవర్ గొంతు ఆవేశంగా సాగుతున్నది.

టాక్సీ దూసుకుపోతున్నది. రోడ్లనిండా జనం టాక్సీ ఎవర్ని గుద్దుకుంటుందో అని క్రిష్ణారెడ్డికి భయంగా వుంది. ఇంత జనాన్ని చూసే అలవాటు పోయింది అతనికి. అందుకే భయంగా "కొంచెం మెల్లగ బోనీ" అన్నాడు.

"ఏం భయపడకండ్రి సార్!" డ్రైవర్ గొంతు ధీమాగా వుంది. క్రిష్ణారెడ్డి టాక్సీ కిటికీల్లోంచి అటుయిటు చూసాడు.

"పట్నం శాన పెరిగింది సార్! అస్సలు చుట్టుపక్కల మస్తు ఊర్లు పట్నంలనే కలిసిపోయినయి డ్రైవర్ చెప్తున్నాడు.

"హో! ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావటంతో గిక్కడ భూములకు గిరాకీ పెరిగింది! ధర పెరిగింది... లత చెప్పింది కరెక్టే!... మీ పాలుకు వచ్చే భూమిని మీ తమ్మునికి... గిరిధర్‌కు వదిలి పెట్టి రాకుండ్రి. అమ్ముకునే రాండ్రి!... అంది లత. అందుకే నన్ను ప్రయాణం కట్టమని వెంటబడ్డది. మందిదగ్గర పైసలున్నయి. భూములకు గిరాకీ వుంది గనుక క్షణంల భూములమ్ముడు పోతయి. కష్టమేముండదు! గిప్పుడు రూపాయలను బ్యాంకులు డాలర్లకు మార్చి అప్పటికప్పుడే ఇస్తున్నరంట! భూమి అమ్మిన పైసల్ని డాలర్లకు మార్చి తీస్కపోత!... లత గట్టిగ చెప్పకపోతె తనకీ ఆలోచన వచ్చేదే కాదేమొ!... "క్రిష్ణారెడ్డి తృప్తిగా టాక్సీ సీటు మీదికి వెనకకు ఒరిగాడు. అతని ముఖం మీద సంతృప్తి అలుముకుంది - లత చాల సమర్థురాలు! లత లేకపోతె తన జీవితం ఎటు ఒరిగేదో యేమొ! - ఆ ఆలోచన తరుచు క్రిష్ణారెడ్డిలో పుడ్తనే వుంటది. ఆ ఆలోచన పుట్టినప్పుడల్లా లత అంటె అతనికి గర్వం కలుగుతుంది అతని మనస్సులో.

అస్సలు లత తన అంతరాత్మ! తన అంతరంగ ఆకాంక్ష! ఆమె మాటను ఎప్పుడూ కాదనలేదు తను! లత తన బలం! తన బలహీనత కూడా!... గట్టిగా నిట్టూర్చాడు క్రిష్టారెడ్డి.

టాక్సీ మెయిన్ రోడ్డునుంచి ఎడమవైపుకు తిరిగింది. సంగిగూడెం వైపు పరిగెత్తింది. రోడ్డు గతుకులుగా వుంది. ఎత్తేస్తుంది. టాక్సీ వెనుక పక్కల ఎర్రదుమ్ము లేచింది. ఈ దుమ్ముకు భయపడే క్రిష్టారెడ్డి ఏ.సి కారు తీసుకున్నాడు. కిటికీలన్నీ మూసే వున్నాయి. అయినా క్రిష్టారెడ్డి ఆ దుమ్ముకు జడిసి కాగితం కర్చీఫ్‌తో ముక్కు మూసుకున్నాడు. 'దుమ్ము అంటె ఎందుకీ భయం! చిన్నప్పుడు తను దుమ్ములో ఆడుకున్నాడు. దోస్తులం... దుమ్ము ఇసుక తీసి ఒకరి మీద ఒకరం చల్లుకునే వాళ్ళం! ఈ దుమ్ములోనే కబడ్డీ ఆట ఆడితే మోకాళ్ళన్నీ చెక్కలై రక్తం కారేది. ఆ గాయాలమీద రక్తం ప్రవహించకుండ దుమ్మును తీసి చల్లుకునే వాళ్ళం. కాళ్ళేకాదు ముఖాలన్నీ దుమ్ముతో నిండిపోయేయి కబడ్డీ ఆడితే! చిర్రగోణి ఆట?... అబ్బ గీ దుమ్ములోనే ఉరుక్కుంట ఉరుక్కుంట గిల్లిని దండతో కొట్టేవాళ్ళం. ఎంత మజా వచ్చేది గా ఆటలు!... "క్రిష్టారెడ్డి ఆలోచనలకు బ్రేక్ వేసాడు డ్రైవర్–

"ఏ ఊరు సార్!... ఎటు దిక్కు పోవాలె!" ఎదురుగా రెండు రోడ్ల సంగమం కన్పించింది. క్రిష్టారెడ్డి అటు యిటు చూసాడు. అన్నీ సర్కార్ కంపచెట్లు. అమ్మో! విషపుముండ్లు. "గివి అసలు మన దేశంవి కావట. చెల్కలకు గట్లు పోసెటందుకు జపాన్‌నుంచో ఎక్కడ్నుంచో సర్కార్ దిగుమతి చేసుకుందట. చిన్నప్పుడు అక్కడోటి ఇక్కడోటి కన్పించే సర్కార్ తుమ్మ గిప్పుడు అంతట గవే నిండిపోయినయి... సరే! ఎటుపోవాలె సంగిగూడెంకు" క్రిష్టారెడ్డి. ఆలోచనలో పడ్డాడు.

అప్పుడే ఎవరో టాక్సీ పక్కకు వచ్చారు. తెల్లదోతి అంగీ. కిటికీని కొంచెం దించి క్రిష్టారెడ్డి "సంగి గూడెం ఎటు పోవాలె?" అడిగాడు.

ఆ వ్యక్తి క్రిష్టారెడ్డిని ఒక్క క్షణం పరిశీలించి చూసాడు.

"ఒరే! క్రిష్ణవేనా నువ్వు? నేను నీ అన్ననురా! గుర్తుపట్టలేద? భుజంగరెడ్డిని!..." అరిచాడు ఆ వ్యక్తి. క్రిష్టారెడ్డి మెదడు క్షణంసేపు గతంలోకి పరిగెత్తింది. ఆ వ్యక్తి మీద ఫోకసయింది.

"హా! భుజంగన్న! గుర్తుపట్టిన. నిను గుర్తుపట్టకపోవుడేంది!" అని నవ్వాడు. తొందరగానే గుర్తుపట్టగలిగినందుకు తనను తానే మెచ్చుకున్నాడు మనస్సులో క్రిష్టారెడ్డి.

టాక్సీ డోరు తెరుచుకొని భుజంగరెడ్డి క్రిష్టారెడ్డి పక్కన కూర్చున్నాడు.

"డ్రైవర్! ఇగో గీ కుడి చేతి బాట పొంటి పోనీ! నేను ఊరికే పోదామని బస్సుకోసం చూస్తున్న. పా! పోనీ..." అని భుజంగరెడ్డి డ్రైవర్‌ను ఆజ్ఞాపించాడు.

క్రిష్టారెడ్డి సీట్లో అటు పక్కకు జరిగి కూర్చున్నాడు.

"గిక్కడ్నుంచి ఓ అరగంట పడ్తుందా అన్నా?" అని అడిగాడు క్రిష్టారెడ్డి.

అదే పదేండ్ల కింద వచ్చినప్పుడు క్రిష్టారెడ్డి భుజంగరెడ్డి దిక్కే చూడలేదు. పలకరించలేదు. పాలిపగ! "సంగిగూడెం యాడికి దగ్గర్నే మరశిపోయినవ తమ్ముడు!...

మనం నడుసుకుంట వచ్చి పట్నంల సెన్మా చూసినం ఒకటి రెండు సార్లు. యాది మరిచిపోయినవ? యే సెన్మలు... బాలనాగమ్మ... సంసారం - అనుకుంట..." జ్ఞాపకాలతో సంతోషంగా పెద్దగా నవ్వాడు భుజంగరెడ్డి.

టాక్సీ అంత ఊగిపోయినట్లనిపించింది క్రిష్టారెడ్డికి. ముఖం చిట్లించాడు. "ఇతన్ని లత చూస్తే టాక్సీలకు ఎక్కనిచ్చేది కాదు. మర్యాద తెల్వని బ్రూట్! ఏందది అంత లాశిగ నవ్వు!... అరుపుల లెక్క మాటలు!..."

ఏం క్రిష్ణ శాన యేండ్లకు వచ్చినవు. నాయన పోయిండని, వచ్చినవ?... అయిన మీ తమ్ముని తీరు యేం బాగలేదు. ఊర్లు బట్టుకొని తిర్గుతడు. వ్యవసాయం పట్టించుకోడు... అయితే గీసారి నీ భూమి నువ్వు పంచుకునే పోతనని వచ్చినవ?... అయిన ఇంకెంత కాలమని పొత్తుల వుంటరు. నువ్వక్కడ దూరదేశంల... భూమిల యేం పండుతుంది లేంది నీకేం తెలుస్తది గక్కడికి. మేం అన్నదమ్ములం యేరుబడి శాన్నాళ్ళాయే! మా ఎవరి వ్యవసాయం వాళ్ళం చేసుకుంటున్నం! గంతే!... ఎన్నాళ్ళున్నా పాలు పంచుకునేదే గద!..." క్రిష్టారెడ్డి వైపు చూసి పెద్దగా నవ్వాడు భుజంగ రెడ్డి. క్రిష్టారెడ్డి యేం జవాబియ్యలేదు. భుజంగరెడ్డి ఊర్కోలేదు. "వచ్చినోనివి వేరుపడే పోతవ తమ్మీ!" స్పష్టంగా అడిగాడు.

"ఏమో గట్ల అనుకునే వచ్చిన. అనుకోంగనె భూములు అమ్ముడు పోతయ అన్న!" సందేహం ధ్వనించింది క్రిష్టారెడ్డి గొంతులో.

"అందరికీ బూములయినయి అనుకో! తలుసుకోంగనే కొనెటోళ్ళు దొరుకరు... కానీ..." భుజంగరెడ్డి మాట పూర్తికాకముందే

'భూమికి ధర ఏం వుంది..." అడిగాడు క్రిష్టారెడ్డి.

"ధర అంటె... చెప్పెటందుకు మస్తు చెప్తున్నరు. కాని చెప్పిన ధరకు కొనెటోళ్ళు యేరి? నువ్వు అమ్మదలచుకుంటె నాకు చెప్పు. ఏడికో ఆడికి అమ్మిపెడ్త. నీ పైసలు నీ చేతిల బెడ్త అనుకున్న టైమ్‌కు."

"గదే అనుకుంటున్న ఒక్క మొకాన పైసలిచ్చేటోల్లు కావాలె. మళ్ళ ఆర్నెల్లు యేడాది అని ముద్దతు పెడ్తే నడువదు. అన్న! చూడు ఎవరైన ఒక్క కిప్తిలో పైసలిచ్చెటోల్లు కావాలె."

"అమ్ముతవు బాగనే వుంది. గాని మీ బూములు పొతం లేక పడావా పడివున్నయి. వ్యవసాయం చేయాల్నంటె బాగనె పెట్టుబడి పడ్తది. అందుకని మంచి ధర పలుకుడు కష్టమే..." నసిగాడు భుజంగరెడ్డి.

"ఏదో ఇంటర్నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ... వస్తుందని భూములకు... గిరాకీ పెరిగిందని విన్నానే..." సంకోచంగానే అడిగాడు క్రిష్టారెడ్డి. "ఒకవేళ కొనేవాళ్ళు లేరని చెప్పి భుజంగన్న తన భూమిని అగ్వకి సగ్వకు కొంటనని చూస్తుండ యేంది? - లత చెప్పనే చెప్పింది వచ్చేటప్పుడు - జాగర్తగ ధరలు నలుగుర్ని అరుసుకొని అమ్మండి. అక్కరకు అమ్ముతున్నమని తెలిస్తే - ఇప్పటిదిప్పుడు అమ్ముడు పోవాలె పైసలు మూటగట్టుకొని పోవాలని వచ్చిండని తెలిస్తే అడ్డగోలు ధరకు కొనేవాళ్ళుంటరు! - అన్నది లత! నేను జాగర్తగా వ్యవహారం నడుపుకోవాలె" అనుకున్నాడు మనస్సులో క్రిష్టారెడ్డి.

"మీరు భూమి కొంటె మంచిగుంటది భుజంగన్న! మన భూమి మనండ్లనే వుంటది." అన్న మనస్సు తెలుసుకోవాలని అడిగిండు క్రిష్టారెడ్డి. "అంతేగాదు అంత భూమిని ఒక్క మొకాన కొనుక్కునెటోళ్ళు దొరకాలె! కొన్నా వెంటనే పైసలిచ్చెటోళ్ళు కావాలె! –" అన్నాడు క్రిష్టారెడ్డి.

"అయినా బజారు ధర తెలుసుకొనే అటో యిటో పాలి వానికి అమ్మిందే మంచిది–" అనుకున్నాడు క్రిష్టారెడ్డి మనస్సులో.

"నేనా? –" నవ్వాడు భుజంగరెడ్డి.

"నా వంద ఎకరాలే నేను పంట పండించుకోలేకపోతున్న!... సరే నువ్వే అమ్ముకొని జల్ది పోవాల్నని అనుకుంటున్నవు కాబట్టి... ఏదో నీకు సాయం చేసినట్లుంటది... నేనూ మా తమ్ముడు జంగారెడ్డి కలిసి కొంటె కొంటం. జంగయ్య యేదో తోట పెట్టాల్ననే ఆలోచనల వున్నడు. బ్యాంకులు లోన్లు పిల్చి పిల్చి ఇస్తున్నయంట. గా లోనేందో తీసుకొని తోట పెడ్దం ఇద్దరం కూడి అన్నడు..."

"గట్లయితే వేరోల్ల భూమి కొనుడు యేంది. నా భూమే కొనుండ్రి. గట్లు గట్లు కలిసిన భూములు మంచిగుంటది." అన్నాడు ఆత్రంగా క్రిష్టారెడ్డి.

"వీన్ని కొంచెం బోర్ల పడేసి భూమిని అగ్వకు కొనొచ్చు" అని అనుకున్నాడు భుజంగరెడ్డి – క్రిష్టారెడ్డి తొందరను కనిపెట్టి.

సరే! సూద్దాం. నలుగుర్ని పిలిచి ధర నికరం చేసుకుందం. నువ్వు నెల రోజులుంటవు గద!" అన్నాడు.

"నెలనా? అంత సెలవు లేదు నాకు! నాలుగు రోజులకని వచ్చిన... కస్తిగ ఇంకో నాలుగు రోజులుంట. అంతే!" అన్నాడు క్రిష్టారెడ్డి.

"డ్రైవర్! కుడి దిక్కు మలుపు అగో అదే బంగ్ల." డ్రైవర్ని ఆదేశించాడు భుజంగరెడ్డి. తొందరగనే మాట కుదిరినందుకు ఉత్సాహంగా వున్నాడు భుజంగరెడ్డి.

టాక్సీ బంగ్ల ముందల ఆగింది. భుజంగ రెడ్డి "సరే! నేను మల్ల కలుస్త ధర దగ్గర మట్టుకు ఎక్కువ ఆశ పెట్టుకోకు. ఒక్క మలక పైసలు చేతుల పడేది చూసుకో క్రిష్టా!" అని భుజంగరెడ్డి టాక్సీ తలుపును ధడాలున వేసి వెళ్ళిపోయాడు. క్రిష్టారెడ్డి టాక్సీలనుంచి దిగాడు. బంగ్ల ఎత్తుగా అట్లనే వుంది. బంగ్లను కిందినుంచి మీదికి మీదినుంచి కిందికి చూసాడు. క్రిష్టారెడ్డి కండ్లు చికిలించుకొని పోయాయి. బంగ్ల గోడలన్ని పెచ్చులు ఊడిపోయి వున్నాయి. సున్నం లేక పాకురు బట్టి వుంది బంగ్ల. రజాకార్ల జమానాలో బంగ్లను సంగపోల్లు కూలగొట్టకుంట ఎట్ల చూసుకున్నడో తండ్రి యెన్నోసార్లు కథలు కథలుగా చెప్పేవాడు." గసొంటి తాకిడి తట్టుకున్న బంగ్ల గిప్పుడు గిట్ల పాడువడిపోయింది!" క్రిష్టారెడ్డి కండ్లు ఆర్ద్రమయ్యాయి.

"వ్యవసాయంల వచ్చినంత ఆదాయం యేం జేస్తున్నడు గిరిధర్!" ముఖం చిట్లించాడు తమ్ముడు గిరిధర్ రెడ్డిని తలచుకొని క్రిష్టారెడ్డి. టాక్సీ డ్రైవర్ వైపు తిరిగి –

"ఎంతయింది?" కసిరినట్లుగా అడిగాడు.

"మూడొందలు సార్!"

"అంతనా? నీ మీటరు సరిగ్గా వుంద?" మీటరు వైపు చూసాడు క్రిష్టారెడ్డి.

"మీటర్ మంచిగనే వుంది సార్! దూరం శాన వుంది. గిప్పుడేమొ పెట్రోలు, డీజిలు ధరలు పెరిగినయి. ఛార్జీలు పెరిగినయి... మళ్ళా వాపస్‌లో సవారీ దొర్కదు సార్! –" నెమ్మదిగా చెప్పాడు డ్రైవర్.

"సరే! సరే! గీ రెండొందలు తీస్కో" ఇయ్యబోయిండు క్రిష్టారెడ్డి.

"బిచ్చమిస్తున్నరా సార్! మీటరు ప్రకారం మూడొందలయింది."

"నాకు ఎరికే. మీరు ఎక్కువ చెప్తరు." ఈ మధ్యనే స్వదేశం ఇండ్యా పోయి వచ్చిన దోస్తు క్రిష్టారెడ్డికి చెప్పాడు – "అరే! ప్రతీది బేరం చేయాలెరా ఇండ్యాలో. సగానికి సగం తగ్గించాలనుకో." దోస్తు హెచ్చరికను గుర్తు చేసుకునే క్రిష్టారెడ్డి రెండొందలు ఇయ్యబోయాడు మళ్ళా!

"వీనికసలు నూట యాభై ఇయ్యవల్సింది!" అనుకున్నాడు కోపంగా మనస్సులో.

"ఎక్కువ చెప్పే సవాలే లేదు సార్! మీటరు ప్రకారం అంతే – మూడొందలు."

క్రిష్టారెడ్డి ఓపిక నశించింది. విసురుగా పర్సులోంచి ఇంకో వంద నోటు తీసి మూడొందలు టాక్సీ డ్రైవర్‌కిచ్చాడు.

"డ్రైవర్! సామాను తీసి లోపల పెట్టు" ఆజ్ఞాపించాడు.

"లేదు సార్ మీ సామాను మీరే తీస్కోండి. అది నా పని కాదు." అని డ్రైవర్ టాక్సీలో కూర్చున్నాడు.

"ఎంత బలిసిపోయింద్రు మంది! అమెరికాలోనైతే ఎవరి సామాన్లు వాళ్ళే మోసుకోవల్సిందే. కాని గిది ఇండ్యా! తన తాతగారు చెంబట్కకు పోతే జీతగాడు బయటి చెంబులో నీళ్ళు తీస్కొని వెంట పోయేటోడు! వీడు సామాను, తీసి లోపల పెట్టు అంటె నీల్గుతున్నడు!" క్రిష్టారెడ్డి అటు యిటు చూసాడు. టాక్సీ వెళ్ళిపోయింది. అది లేపిన దుమ్మును భరించలేక కాగితం కర్చీఫ్ తీసి ముక్కుకు అడ్డంగా పెట్టుకున్నాడు. ఎవరూ కనపడలేదు. అయిష్టంగా సూటుకేసు షోల్డరు బ్యాగ్ చేతుల్లోకి తీసుకొని లోపలికి నడిచాడు. లోపల దివాన్‌ఖానా ఖాళీగా వుంది.

"తన చిన్నప్పుడు నాయన ఇగో గిక్కడ్నె కూచునెటోడు!" కుర్చీ కోసం చూసాడు క్రిష్టారెడ్డి. కుర్చీ దుమ్ముపట్టి కన్పించింది. బెత్తం అల్లికంత చినిగిపోయింది. "గీ కుర్చీని సుత సవరించేది చాతగాదా తమ్మునికి!" క్రిష్టారెడ్డి మనస్సు బరువెక్కింది. "గిరిధర్ చిన్నప్పట్నుంచి అంతే! ఆదర్శాలు వల్లించడమే గాని పనేది చాతగాదు! గీ దివాన్‌ఖానా నిండా రైతులు కూర్చునేవాళ్ళు. రజాకార్లకన్న ముందల రైతులు అప్పులకని... నాగులకు పెచ్చులకు ధాన్యం కావాలని వచ్చేటోళ్ళు. కౌలుదారీ చెల్లించెటందుకు కిటకిటలాడేవాళ్ళు. కొందరు అంటరానివాళ్ళుంటె పెద్ద దర్వాజా బయటనే వుండి – బాంచన్ కాల్మొక్కుత దొర! – అని మాట్లాడేవాళ్ళు. ఆ కాలంల ఎన్ని వందల వేల ఎకరాల భూములుండేయి తాతకు. కమ్యూనిస్టు ఉద్యమం కాలంల నాయన భూములను రైతులకు భూమిలేని వాళ్ళకు పంచిపెట్టిండు. గా కోపమే భుజంగన్న తండ్రికి... పెద్ద నాన్నకు బాగ వుండేది. పుణ్యానికి భూములు పంచిపెట్టిండని మస్తు లొల్లి జేసిండు. రజాకార్ల లొల్లి అయిపోంగనె వేరు పడాలని పెద్ద నాన్న పోరు పెట్టిండు. గాని ఇంతల పెద్దనాన్న చచ్చిపోయిండు. అయిన వేరు ఆగలేదు. పెద్దనాన్న కొడుకులు భుజంగన్న, జంగన్నలు తమ పాలు

తమకావాలెనని పట్టుబట్టిండ్రు. భూమి పంపకాల దగ్గర బాగ పంచాయతీలైనయి. రెండు తరపుల పెద్ద మనుషులు వచ్చిండ్రు. సమఝాయించిండ్రు. తాత తండ్రుల ఆస్తులు తరగడానికి నాయననే కారణమన్నరు భుజంగన్న, జంగన్నలు. కత్తులు నూరిండ్రు. ఆఖరికి నాయన పెద్ద మనస్సుతో పెద్దలు చెప్పిన ప్రకారం ఒప్పుకుండు. వాళ్ళకి రెండొందల యాభై ఎకరాలు పంచి యిచ్చిండు. తను నూట యాభై తీసుకుండు. తర్వాత రైతులు యిచ్చిన భూమితో రెండొందల ఎకరాలయింది. అందులో తనకు పంచుకుంటె వందెకరాలు రావాలి!... కాని తనేం జేస్తున్నడు! ఒకప్పుడు తన తండ్రి మీద పగబట్టిన భుజంగన్నకే భూమిని అమ్మి పైసలు మూటగట్టుకొని పోతనని చూస్తుండు! దాంతోటి ఊర్లె వాళ్ళదే పైచేయి అయితది!... కాని లత వచ్చేటప్పుడు చెప్పింది – మల్లగుల్లాలు పడకుంట భూమిని ఒక్కసారె పైసలిచ్చెటోళ్ళకు అమ్మండ్రి! – అని. అది నిజమే! మళ్ళమళ్ళ వచ్చి పైసలు వసూలు చేసుకునుడు తన వశం కాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భుజంగన్న, జంగన్నలే ధర పెట్టేటట్లున్నారు!... ఎవరు కొంటె ఏంది. తనకు ఒక్క మొకాన పైకం ముట్టాలె!...” బరువెక్కిన హృదయంతో నిట్టూర్చాడు క్రిష్ణారెడ్డి.

అతనికి మళ్ళా తండ్రి యాదికి వచ్చాడు – ” తెలంగాణా పోరాటం అయినంక ప్రభుత్వం యేర్పడ్డంక గీ దీవాన్ ఖానా నిండ రైతులు చేరేవాళ్ళు. కౌలుదారి కేసులను నాయనే ముందటుండి నడిపించిండు. గప్పుడే రైతులు నాయన చేసిన మేలును మరచిపోకుంట కౌలుదారి కొట్లాడినందుకు అందరు కలిసి చెరువుకింద యాభై ఎకరాల తరి ఇచ్చిండ్రు. అందుకే పెద్ద నాన్నకు నాయనంటె కంటు అయింది. రైతుల దిక్కు అయి భూములిప్పిచ్చుడేంది? వున్న తాత తండ్రుల భూములకు ఎసరు బెట్టిండు వీడు అని కసి పెంచుకుండ్రు పెద్ద నాన్న ఆయన కొడుకులు. కాని నాయన మాత్రం రైతులకు దగ్గరయిండు. తర్వాత నాయన సర్పంచ్‌గ శాన రోజులు ఊరి మీద పెత్తనం సాగించిండు. గది సుత భుజంగన్న, జంగన్నలకు మంట అయింది. గసొంటోడు ఇయ్యాల నాతోటి అంత మంచిగ తనే కల్పించుకొని వచ్చి మాట్లాడిండు. గదంత భూమి కొనుక్కుంటననే నా? భుజంగన్న భూమి కొంటనన్నడంటె అమ్మ ఏమంటదో యేందో?...” క్రిష్ణారెడ్డి దివాన్ ఖానా గోడలవైపు చూసాడు. గోడలన్ని పెచ్చులూడిపోయి మురికిగా వున్నాయి. కప్పుకు బూజు వేలాడుతున్నది. “గా బూజు దులిపించే శక్తి లేద వీనికి. మొన్న దినాలప్పుడు కూడ సున్నాలేయించి బాగ చేయించలేద? పంటంత యేంజేస్తుండు తమ్ముడు? లత అన్నది కూడా – ముప్పైయేండ్ల నుంచి భూమ్మీద వచ్చే పంటను మీ తమ్ముడొక్కడే అనుభవించిండు. ఇగసాలు! భూమిని గీ మల్క అమ్మేసి రాండి! పిల్లలకు... నవ్య నవీన్‌లకూ గా దేశం పోవాల్నని ఇష్టం లేదు. ఏదో ఒకటి తెగదెంపులు చేసి రాండ్రి. మన పాలు మాత్రం మీ తమ్ముడిమీద జాలితో వదిలిపెట్టి రాకుండ్రి. వచ్చి నా భూమి! నా భూమి అని సెంటిమెంట్‌తో కలవరించకుంట ఇండ్యాను తలుచుకుంట మమ్ముల్ని పరేషాన్ చేయకుండ్రి! –” లత మాటలు క్రిష్ణారెడ్డి చెవుల్లో గింగురుమన్నాయి. క్రిష్ణారెడ్డి దివాన్ ఖానా దాటి లోపలికి పోయాడు–

“ఇల్లంతా ఖాళీగా వుంది. అంటె దినాలకు వచ్చిన చుట్టపక్కాలంత వెళ్ళి పోయిండ్రు! – కాని ఎంతమంది నౌకర్లు వుండేవాళ్ళు! ఒక్కరూ కన్పడరేంది! –” క్రిష్ణారెడ్డి

లోపలికి అడుగుపెట్టాడు. సూట్‌కేసు షోల్డరు బ్యాగు గోడవారగా పెట్టాడు. చతుశ్శాల భవంతి మధ్యలో హౌజు అట్లనే వుంది. కాని వెలుతురు గాలి వచ్చే ఖాళీస్థలాన్ని పైన రేకు కప్పి పెట్టారు. అందుకే ఇల్లంత చీకటిగా వుంది. హౌజుకు నాలుగువేపుల నాలుగు చెక్క స్తంభాలు అట్లనే వున్నాయి. వాటిమీద చెక్కణం అట్లనే వుంది. పైన తీగలు పారినట్లుగా చెక్కణం ఆ తీగలకు అంగూరు పండ్లు! ఎంత అందంగా వుంది ఆ పనితనం! చెక్కణం చెదరిపోకున్నా అంతా మాసిపోయి దుమ్ము, ధూళి పట్టి వున్నాయి. ఎండిపోయి దుమ్ము నిండిన మామిడి తోరణాలు వేలాడుతున్నాయి. అంతా దుమ్ము కొట్టుకపోయిన వాతావరణం!- "గీ పందిరి కిందనే పెళ్ళిళ్ళు జరిగేయి. తను లత గృహప్రవేశం చేసి గీ పందిరి కిందనే కూర్చున్నారు! గిప్పుడు గిక్కడ అప్పటి కళే లేదు!-" క్రిష్టారెడ్డి కుడి చేతి వైపున్న అర్ర దిక్కు చూసాడు. తలుపులు తీసే వున్నాయి. లోపలికి పోయాడు. ఇది తన తల్లి వుండే అర్ర. "అగో! గా ఎదురంగ వున్న గోడ అల్మారీలనే తన తల్లి నగలు, బట్టలు పెట్టుకునేది. గా అల్మారీకి ఎప్పుడూ తాళముండేది. దాని తాళపు చెవి నగిషీ చెక్కిన వెండి రింగుతో తన తల్లి రొండికి వేలాడుతుండేది. తను శాన చిన్నగున్నడు. ఒక పాలి అమ్మ అల్మారీ తలుపులు తీస్తే నోట్ల కట్టలు! ఎంత బంగారం! ఎంత వెండి!... అరే! గిప్పుడు గా అల్మారీకి తాళమే లేదేంది!..." క్రిష్టారెడ్డి ఆందోళనగా అర్రనంత చూసాడు. ఎత్తైన పట్టె మంచం అట్లనె వుంది. ఆ మంచంమీద మూటలాగ ఎత్తుగా కనపడింది. కండ్లు విప్పార్చి చూసాడు క్రిష్టారెడ్డి. కొంచెంసేపటికి అతని కండ్లు ఆ మసక చీకటికి అలవాటుపడ్డాయి. మంచంలో వుంది మూట కాదు. ముడుచుకొని పండుకొని వున్న తన తల్లి.

"అమ్మా!-" అని అతని నోటినుంచి పిలుపు అప్రయత్నంగా బయటికి వచ్చింది. మూట కదిలింది. ముఖంమీది నుంచి పచ్చరం తీసింది.

"అమ్మ!" నోరు తెరిచాడు క్రిష్టారెడ్డి. "అమ్మ ఎంత మారిపోయింది! యీ పదేండ్లల్లో. తను పదేండ్ల కింద వచ్చినప్పుడు అందంగ నవ్వుకుంట వున్నది. ఇప్పుడెంత ముసలిదైపోయింది! బలహీనమై పోయింది! నాయన మొన్న చనిపోయినప్పుడు ఎనభై అయిదేండ్లు! ఎనభై నాలుగేండ్లప్పుడు నాయనకు సహస్ర చంద్ర దర్శనోత్సవం చేసినప్పుడు తమ్ముడు ఉత్తరం వ్రాసిండు. కాని తను రాలేకపోయిండు! నాయన కన్న అమ్మ పదేండ్లు చిన్నది. ఇప్పుడు అమ్మకు డెబ్బై అయిదేండ్లు! ఈ వయస్సులో అమెరికాలో ఎంత బలంగా చలాకీగా వుంటారు!"

"ఎప్పుడొచ్చావ్ క్రిష్టా!" తల్లి మాట విని క్రిష్టారెడ్డి దగ్గరికి పోయి మంచం మీద కూర్చున్నాడు.

"ఇప్పుడే-" అన్నాడు. తల్లి కదలకుంట కూర్చుంది. పైట చెంగులో మొఖం దాచుకొని వెక్కి వెక్కి యేడ్చింది. "గీ యేడ్పు తండ్రి కోసమా? సంసారం ఇల్లు గిట్లయిందని!! అమ్మకు ఎంతకష్టం! ఎంత దుఃఖం!" విచలితుడయ్యాడు క్రిష్టారెడ్డి.

"అమ్మా! నాయన గింత తొందరగా పోతడనుకోలేదు..." అన్నాడు.

"సహస్రచంద్ర దర్శనం జరిగిందగ్గర్నుంచి నాయన ఎట్లనో అయిండు క్రిష్టా! అంతకు ముందల నేను నూరేండ్లు బతుకత మా నాయనమ్మ లెక్కన అని సంబరంగ

మాట్లాడెటోడు. ఎట్లనో బుగులు పెట్టుకున్నట్లయిందు. నువ్వు రాలేదు. గదే పెద్ద రంది అయింది ఆయనకు..." తరవాత మాట పెకలలేదు రాజేశ్వరికి.

"అమ్మా! గిరిధర్ యేడి. కన్పిస్తలేదు" అడిగాడు. క్రిష్ణారెడ్డి తాను రాకపోవడానికున్న కారణం చెప్పకుండా.

"గిరిధరా!... వానాకాలం వచ్చి నెల అయినా వానల్లేవు. విత్తనాలు వేయలేదు. రైతులంత బెంగటిల్లింగ్రు. శానమంది పనుల్లేక తిండి గడువకుంట వున్నరు. గీ కరువుకాలంల గంజి కేంద్రం అని నడుపుతున్నరుగద! గక్కడికి పోయిండు. అన్నయ్యొ ఇయ్యాల వస్తడు. వచ్చేసరికి ఇంట్ల వుంటనన్నడు. వస్తడిక."

"వానికి ఇల్లు సంసారం సోయి లేదు గాని మందికోసం గంజికేంద్రం నడిపేటందుకు పోయిండా!" కోపంగా అన్నాడు క్రిష్ణారెడ్డి. తల్లి యేం మాట్లాడలేదు.

"గిరిధర్ భార్య పుష్ప – పిల్లలేరి? ఇల్లంత ఖాళీగ కన్పిస్తున్నది?" దర్వాజాలోంచి బయటికి చూస్తూ అడిగాడు క్రిష్ణారెడ్డి.

"పుష్ప పిల్లలు ఇప్పుడిక్కడ వుంట లేరు. పిల్ల రాధిక పెండ్లి కెదిగింది. డిగ్రీ చదువుతున్నది. కొడుకు మోహన్ ఇంటర్లో వున్నడు. పుష్ప తండ్రి పోలీసాఫీసరు. తమ్ముడు కలెక్టరు. పిల్లలు చదువులు పెండ్లిల్లు మేమే జరిపిస్తమని పట్నం తీసుకపోయింగ్రు. గక్కడ్నే వుంటున్నరు గాని సెలవులకని వచ్చి ఇప్పుడు గిక్కడ్నె వున్నరు." "నిట్టూర్చింది రాజేశ్వరి. క్రిష్ణారెడ్డి కొంచెంసేపు నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"అప్పుడు నౌకరి చెయ్యరా అంటె వినకుంట వ్యవసాయం చేస్తనని ఇంటర్లనే చదువు ఆపేసి ఆదర్శాలకు పోయి ఊరికి వచ్చిండు. ఊరిని ఉద్ధరిస్త పంటలు పండిస్తనని పొంకణాలకు పోయిండు... ఇంతకు గిరిధర్ వ్యవసాయం ఎట్లుంది" అడిగాడు క్రిష్ణారెడ్డి.

"ఏం వ్యవసాయంరా! మూడేండ్లనుంచి వానల్లేవు. బోర్లల్ల నీళ్ళు లేవు. క్రిష్ణానది కాలువ వస్తదన్నరు అది ఉత్తదయింది. నీళ్ళులేంది ఏం పంట పండిస్తరు ఎవరైన?" అంది తల్లి నిరాశ నిండిన గొంతుతో.

"గింత అధ్వాన్నంగా పరిస్థితులుంటె నాకెందుకు వ్రాయలేదు." యాష్టపడుతూ అడిగాడు క్రిష్ణారెడ్డి.

"మీ నాయన వున్నప్పుడు వ్రాసిండు నీకు. నవ్వు యేమైన పైసలు పంపిస్తవేమొ, మళ్ళీ వ్యవసాయాన్ని నిలబెడ్దాం అనుకున్నడు. ఇప్పుడున్న బోర్లల్ల నీళ్ళు లేవు. పెద్ద బోర్లేసి ట్రాక్టర్ కొని వ్యవసాయం పైకి తెస్తననుకున్నడు. నువ్వే జవాబు ఇయ్యకపోతివి. నాయన శాన బెంగటిల్లిండు దాంతోటి. ఊర్లె మునుపటి అధికారం లేదు. గౌరవం లేదు. ఉడుకు రక్తమొచ్చింది. ఊరి జనం మున్నటి తీరుగ లేరు. వ్యవసాయం వానల్లేక మూలబడింది. గిదంత నాయనను కమ్జోరు చేసింది. ఫికర్ పెట్టుకున్నడు. క్రిష్ణా! అందుకే... ఇగ వుండలేకపోయిండు. వెళ్ళిపోయిండు!..." వెక్కి వెక్కి యేడ్చింది రాజేశ్వరి.

"అమ్మా! యేడ్వకు!..." క్రిష్ణారెడ్డి రెండు చేతులతో తల్లిని చుట్టేసాడు.

"తను వ్యవసాయానికి కొంత పైకం పంపిస్తే గిట్ల నాయన బెంగటిల్లెటోడు కాదేమో! – లత ఒక్కటే మంకు పట్టు పట్టింది – మీరు చెమటోడ్చి కూడబెట్టిన డాలర్లను

రూపాయల్లోకి మార్చి మీ కుటుంబానికి పంపిస్తే దాంతో బాగుపడ్తర? జల్సాలు చేసుకొని ఖర్చుపెడ్తరు! మీరు పంపవద్దు - అంది. దాంతో తనూ లతను యేడ్పించడం ఎందుకని ఊరుకున్నడు. తన తండ్రి తన డాక్టరీ చదువుకు హాస్టల్ వసతికి అమెరికా ప్రయాణానికని యెంతో ఖర్చుపెట్టిండు. తను గా రుణం యేం తీర్చుకోలేకపోయిండు! నాయన చావుక్కాడ రాకుంట గిప్పుడేమొ చూసిపోదమని వంకతోటి వచ్చి భూమి పాలు అమ్ముకొని దాలర్లుగ మార్చుకొని తీసుకపోదమని వచ్చిండు!..." కొంచెంసేపు క్రిష్టారెడ్డికి ఇదంత తలచుకొని దుఃఖం వచ్చింది. రాజేశ్వరి ఊరడిల్లింది ఇంతలో.

"నాయనా! క్రిష్టా! నువ్వు స్నానం చేసి భోంచెయ్యి! తర్వాత మాట్లాడుకుందం. దూరప్రయాణం చేసి వచ్చినవు. అలసట తీర్చుకో నాయన!" అంది.

క్రిష్టారెడ్డి లేచి పెరట్లోకి దారి తీసాడు. అక్కడ కూర్మయ్య కనపడ్డాడు.

"దండాలు దొర!" అన్నాడు వంగి.

"కూర్మయ్యా! ఇంకా గిక్కడ్నె వున్నవా?"

"ఎక్కడికి పోత దొరా! గీ ముసలితనంల. నేను చిన్నప్పట్నుంచి గిక్కడ్నె వున్న. మీ సేవ జేసిన. మీ చేతుల్లనె బుగ్గిల కలుస్త" అన్నాడు కూర్మయ్య.

"అంటె కూర్మయ్య ఒక్కడే మిగిలిండన్నమాట!"

"కూర్మయ్యా! స్నానం చేస్త. వేడి నీళ్ళు తోడు" అని క్రిష్టారెడ్డి బట్టలకోసం సూటుకేసు పెట్టిన చోటికి పోయాడు. బట్టలు తువ్వాలు తీసుకొని వచ్చేసరికి కూర్మయ్య వేడినీళ్ళు గంగాళంలో తయారుగ పెట్టాడు. ఆరు బయట స్నానం చేయాలంటె క్రిష్టారెడ్డికి ఎట్లనో అనిపించింది. "బాత్రూమ్... అదే హమామ్‌ఖానా... లేదా! కూర్మయ్యా!" అడిగాడు క్రిష్టారెడ్డి అటూయిటు చూస్తూ.

"అది దొరసాన్లకుంది. మీరిక్కడ్నే తానం పోసుకోండి. నేను ఈపు తోమనా?" పీటమీద టవల్ చుట్టుకొని కూర్చున్న క్రిష్టారెడ్డికి దగ్గరగా వచ్చాడు కూర్మయ్య. అతడు తనకు ఒళ్ళంతా సబ్బుపెట్టి రాసి స్నానం చేయించిన రోజులు గుర్తుకువచ్చి కొంచెం సిగ్గుపడ్డాడు క్రిష్టారెడ్డి.

"ఏమొద్దు కూర్మయ్యా. నేను చేస్త స్నానం." అని చెంబుతో గంగాళంలో నుంచి నీళ్ళు తీసుకొని తలమీద పడకుండ జాగ్రత్తగా ఒంటిమీద పోసుకున్నాడు. నీళ్ళు మురికిగా కన్పించినయి.

"చేదబావి నీళ్ళేనా ఇవి?" అడిగాడు ముఖం చిట్లించి.

"అయ్యో! దొరా ఇంకా చేదబావు లెక్కడున్నయి! అన్ని ఎండిపోయినయి. పంచాయితోళ్ళు నడి బజార్లకాడ బోరు ఏయించిండ్రు. గా నీళ్ళే మోసుకొస్త. బోర్ల సుత నీళ్ళు అడుగంటినయి వానల్లేక మడ్డిమడ్డి వస్తున్నయ్. ఏం జేస్తం! గవే నీళ్ళు గతి అందరికి." కూర్మయ్య మాటలు వింటున్న క్రిష్టారెడ్డికి ఎదురుగా వున్న చేదబావిలో వానకాలం వస్తే నీళ్ళు ముంచుకునేటట్లు పైకి వచ్చే దృశ్యం జ్ఞాపకం వచ్చింది-" ఒకసారి తను తమ్ముడు చెరువులో ఈత గొట్టేటందుకు పోతె తాబేలు పిల్ల దొరికింది. దాన్ని తెచ్చి గీ చేదబావిల విడిచిపెట్టిండు. తాతీళ్ళల్ల వచ్చినప్పుడల్ల ఆ తాబేలును చూసేవాడు. అది

తర్వాత పెద్దగయింది. గిప్పుడు నీళ్ళు లేవు గద చేదబావిల. తాబేలు వుందో లేదో! చచ్చిపోయి వుంటది!..."

"దొరా! ఇగో తువ్వాల తుడుసుకోండ్రి." అన్న కూర్మయ్య మాటలకు ఆలోచనల్లోంచి బయటపడ్డాడు క్రిష్ణారెడ్డి.

తర్వాత వంటింటి దగ్గర పుష్ప రాధిక మోహన్‌లు కన్పించారు.

"పెద్దనాన్న.. అమెరికా పెద్దనాన్న - నమస్తే చెయ్యండ్రి" అని పుష్ప పిల్లలకు చెప్పింది.

పిల్లల ముఖాలు సంతోషంతో వికసించాయి.

"వీళ్ళను అమెరికా తోలుకపోండ్రి - అని అడుగడుగద మరదలు!" అని భయంగా పిల్లలవైపు ఉదాసీనంగా చూసాడు క్రిష్ణారెడ్డి.

పుష్ప భోజనానికి అన్ని అమర్చింది. పీటమీద కూర్చొని క్రిష్ణారెడ్డి కష్టంగా భోజనం కానిచ్చాడు. కింద కూర్చొని తినటం అలవాటు ఇప్పుడు లేదు గద! భోజనం అయినంక మళ్ళా తల్లి అర్రకే దారితీసాడు క్రిష్ణారెడ్డి.

"క్రిష్ణా! కొంచెం నడుం వాల్చకపోయినవు. విమానంల కూసొని కూసొని అలసిపోయి వుంటవ్!" అంది రాజేశ్వరి.

"ఏం లేదమ్మ! అలసటేం లేదు. "క్రిష్ణారెడ్డి మంచం మీద కూర్చొని దర్వాజావైపు చూసాడు. తన వెనుకనే వచ్చినట్టున్నాడు గిరిధర్. అర్ర దర్వాజా గలుమట్ల నిలబడి వున్నాడు.

మనిషి నల్లగయిండు. బక్కగయిండు. అసలు బొక్కలు మాత్రం మిగిలినయ అన్నట్లున్నడు. కండ్లు పెద్దగా కన్పిస్తున్నయి. అసలు శరీరంలో కండ్లు మాత్రమే జీవకళతో వున్నయేమొ!... గిరిధర్‌ను చూడంగనే క్రిష్ణారెడ్డికి కోపం వచ్చింది.

"గిదంత యేందిరా! ఎట్లయినవ్ యేంది?" గద్దించాడు. గిరిధర్ యేం మాట్లాడ లేదు. చూపులు నేలకేసాడు.

"ఏం మాట్లాడ్తడు!" మూలిగింది రాజేశ్వరి.

"రెండొందల యెకరాల భూమి వుంది. సక్కంగ వ్యవసాయం చేసుకోక గీ గంజి కేంద్రాలని పోరగాండ్ల వెంట తిరుగుడేంది?"

"కరువుగద! పేదల నాదుకోవాలనీ-" గిరిధర్ మెల్లగా అన్నాడు.

"పేదలు! పేదలు! ముందల నీ భార్యా పిల్లలను చూసుకో! వ్యవసాయం చూసుకో? గిదంత లేదు. గని మీదంగ తిరుగుళ్ళు!" కోపంగా అన్నాడు క్రిష్ణారెడ్డి

"వానల్లేవు. మూడేండ్లాయె అన్నయ్య!..."

"వానల్లేక పోతె నీరు అక్కర్లేని పంట ఏదైన పండించరాదా?" మళ్ళా అదే కోపం.

"వానల్లేకపోతె ఎర్రటి చెల్కల నాగలే దిగదని అన్నకేమెరుక?" అనుకున్నాడు గిరిధర్.

"అన్నయ్య! వదిన పిల్లలు రాలేదా?" అడిగాడు గిరిధర్ అన్నయ్య దృష్టిని మళ్ళిస్తూ.

"అవును క్రిష్ణా! కోడలు పిల్లలు వస్తే మంచిగుండు." అంది రాజేశ్వరి.

"లత వస్తే పిల్లల్ని ఎవరు చూసుకుంటారమ్మా! పిల్లలు అదే నవ్య, నవీన్‌లు కాలేజీల్ల చేరింద్రు. నవ్య మెడిసిన్లో చేరింది. నవీన్ కంప్యూటరు కోర్సులో చేరిండు. వాళ్ళు కాలేజీలకు పొద్దున్నే పోవాలె. లత లేకపోతె వాళ్ళకు కష్టమైతది–" పిల్లలు అక్కడ ఎంత ఇండిపెండెంటుగా వుంటారో లత అవసరం వాళ్ళకు లేనే లేదనే విషయాన్ని దాస్తూ క్రిష్ణారెడ్డి చెప్పిన మాటలను తల్లీ, తమ్ముడు నమ్మారు.

అస్సలు లతకు ఇండ్యాకు రావాలని లేదు. అందులో దినాల సందర్భంగా రావడం ఇష్టంలేదు. ఆమెకు ఇండ్యాలోని దుమ్ము, ధూళితో నిండిన గాలి అంటే పడదు. ఇండ్యా అంతా మురికి కూపం! మరీ ఆ పల్లెటూరు మురికి కూపం! నేనా మురికిలోకి అడుగుపెట్టదలచుకోలేదు. మీరు పోయి రాంఢ్రి అంది లత. మరీ పట్టుచీరలు, బంగారం, డైమండు నగలు అమ్మే దుకాణాలు అమెరికాలో వెలసినంక లతకు ఇండ్యా రావల్సిన అక్కరే కన్పించడంలేదు.

"ఆ భూమేదో మీ తమ్మునితో పాలు పంచుకొని అమ్మి రాంఢ్రి. మన హక్కు వారసత్వం వదిలేసి రాకుంఢ్రి. భూమిని పంచుకొని అంతా తెగతెంపులు చేసుకొని రాంఢ్రి – అంది లత. నిజమే! గిక్కడ ఏముందని. వానల్లేవు పంటల్లేవు. ఇగ భూమి! భూమి! – అనుకొని ఏం లాభం. అమ్ముకొని పోతేనే మంచిది!" అనుకున్నాడు క్రిష్ణారెడ్డి.

"దినాలకు వస్తావనుకున్నాను అన్నయ్యా!" అన్నాడు గిరిధర్." ఏం చెప్పాలె! లత వద్దంది తర్వాత పోయి భూమి అమ్ముకొని రాంఢ్రి అన్నదని ఎట్ల చెప్పాలె!" క్రిష్ణారెడ్డి మనస్సులోనే అనుకొని పైకి ఏమనలేక తటపటాయించాడు.

"వీలు కాలేదుర. హాస్పిటల్లో ఆపరేషన్లు... పని విడిచి పెట్టి వచ్చే తీరికే లేదు. నా పనిని ఇంకొకరికి అప్పజెప్పేటట్లు వుండదక్కడ. ఇక వీకెండు రెంఢ్రోజులకు మరో రెండు రోజులు కలుపుకొని వచ్చిన." తల్లివైపు చూసాడు క్రిష్ణారెడ్డి.

"అంటె రెంఢ్రోజులే వుంటవ?..." ఆశ్చర్యపోతూ నిరాశగా అంది రాజేశ్వరి.

"అమ్మా అంత కంటె ఎక్కువ వుండలేను. ఆపరేషన్లు ఎప్పట్నుంచో టైమ్ ఫిక్సయి వుంటయి. నా పనిని వేరే డాక్టర్లు చేయరు." నిస్సహాయంగా వుంది క్రిష్ణారెడ్డి గొంతు.

"మరిక్కడి పనులో!..." రాజేశ్వరికి కండ్లల్లో నీళ్ళు నిండాయి. ఏడ్పు నాపుకుంది కష్టంగా.

"క్రిష్ణా! నువ్వు వస్తే కొంత పెట్టుబడి ఇస్తవు కొత్త బోరు వేయించి ట్రాక్టరు కొని వ్యవసాయం సాగిస్తనని గిరిధర్ ఎదిరి చూస్తున్నడు. కొట్టంల పశువుల్లేవు. జీతగాండ్లు లేకుంట తనే వ్యవసాయం చేస్తనంటున్నడు గిరిధర్. జీతగానికి ఒక్కనికి యేడాదికి ఇరవైవేలు అడ్గుతున్నరు. వ్యవసాయంల గంత ఆదాయం ఎక్కడుంటది! అందుకే గిరిధర్ భూమి తనే దున్నుత వ్యవసాయం చేస్తనంటున్నడు. అక్కర పడ్డప్పుడు ఓ కూలోన్ని పెట్టుకుంటె సరిపోతదంటున్నడు. తోటి జీతగాడు లేకుంట వ్యవసాయాలు బాగనే నడుస్తున్నయి. వాళ్ళు ఎక్కడ్నుంచో అక్కడ్నుంచి పెట్టుబడులు తెచ్చి పెడ్తున్నరు. మీ నాయనగాని తమ్ముడుగాని అప్పులంటె భయపడ్డరు. సర్కారు అప్పులు సుత తీస్కోలేదు. తీస్కున్నోళ్ళ సర్కారు అప్పులు మాఫయినయి... క్రిష్ణా! నువ్వు గీ ఒక్కసారి పెట్టుబడి పెట్టినవంటె బండి గాడిన పడ్తది. నాయనా!... నీ చదువు ఆడపిల్లల పెండ్లిల్లు... కర్సులు

గవన్నీ గీ సంసారాన్ని కుంగదీసినయి. నువ్వొక్క మల్క సాయం జేసినవంటె గట్టున పడ్తం నాయనా!...” అంది రాజేశ్వరి. అప్పటికే క్రిష్ణారెడ్డి ముఖం నల్లబడింది. అది చూసి రాజేశ్వరి ఆగిపోయింది. క్రిష్ణారెడ్డి మనస్సులో తుఫాను రేగింది –”

లత చెప్పనే చెప్పింది. వాళ్ళ యేడ్పులకు కల్లబొల్లి మాటలకు కరిగిపోయి వేలకొద్ది డాలర్లు దానం చేస్తనని అనకుండ్రి “మీ కొచ్చే భూమి పాలును తీసుకొని పేగుబంధం తెంచుకొని రాండ్రి. పిల్లలు ఇండ్యా పోరు. ఇగ గక్కడ భూములు పెట్టుకొని యేం లాభం. మళ్ళ మళ్ళ మీరు పోవాలంటె తీరిక వుండదు. మీ పేషంట్లు వేరే డాక్టర్ దగ్గరికి వెళ్ళిపోతె మీకు వేల డాలర్ల నష్టం ప్రతిసారికి – లత చెప్పింది నిజమే –” అనుకున్నాడు క్రిష్ణారెడ్డి మనస్సులో.

“అమ్మా! గిప్పుడు అమెరికాల అంతా మందకొడిగా వుంది. నేనేం సాయం చేయలేను.” క్రిష్ణారెడ్డి సాధ్యమైనంతగా గొంతును విచారంగా మార్చాడు. తల్లి కండ్లల్లోకి చూడలేక తలవంచుకున్నాడు. చూపులు నేలమీదికి వాలాయి.

“రెండు మూడు వేల డాలర్లు క్రిష్ణా! గంతే చాలు. రెండు మూడు వేల డాలర్లంటె మన పైసలు శాననే అయితయి. వాటితో మన ఇల్లు వ్యవసాయం చక్కబడ్తయి. నాయన! ఇల్లు సుత బాగ జేయిస్తనంటున్నడు తమ్ముడు. గీ ఇల్లు మళ్ళీ నిలబడాలంటె గింత మాత్రం సాయం చెయ్యాలె క్రిష్ణా నువ్వు. పాలివాళ్ళ ముందల ఊరివాళ్ళ ముందల నవ్వులపాలు కాకుంట చూసే భారం నీదే... నాయన!” ప్రాధేయపడింది రాజేశ్వరి.

తల్లి మాటలు వినగానే క్రిష్ణారెడ్డి చెవుల్లో లత అన్న మాటలు మళ్ళా ప్రతి ధ్వనించాయి – “వాళ్ళ యేడ్పులు విని కరిగిపోకుండ్రి. పేగు తెంచుకోంది కాదు. ఎన్నడో ఒగనాడు పేగు తెంచుకోవల్సిందే. భూమి... వంద ఎకరాల వరకుంటది భూమి. మీ పాలు భూమి అమ్మి పైసలు పట్టుకరాండ్రి! మీ ఆస్తి భాగం మీరు తీసుకోండ్రి.” తల్లి తమ్ముని ముందు మెత్తబడ్తానని లత బాగనే ఊహించింది. పిల్లలు కూడా – “డాడీ! అమ్మ చెప్పింది కరెక్ట్! మన వారసత్వం వందెకరాల భూమి అమ్ముకునేరాండ్రి. వీ క్యాన్ ఇన్‌వెస్ట్ దట్ మనీ హియర్... ఇన్... అమెరికా (ఆ పైసలను ఇక్కడ అమెరికాలో పెట్టుబడిగా పెడ్దాం)” అని చెప్పారు కూడా. ఆ మాటలు తలచుకొని క్రిష్ణారెడ్డి తెగించాడు. “అమ్మా! నాకే పైసలు అక్కరున్నయి. నా పాలు వందెకరాల భూమి పంచుకొని అమ్ముకొని డాలర్లకు మార్చుకొని తీసుకపోతనని వచ్చిన...” మెల్లగా తను వచ్చిందెందుకో చెప్పాడు క్రిష్ణారెడ్డి తల్లికి.

రాజేశ్వరి కొడుకు మాటలు విని పిడుగుపడ్డట్లు నిశ్చేష్టురాలైంది. గిరిధర్ ముఖం నిర్వికారంగా వుంది. పుష్ప పిల్లలు అక్కడ లేరు. రాజేశ్వరి కొంచెంసేపటికి తేరుకుంది.

“నీ పాలా నీ పాలు ఎక్కడుందిరా! నిన్ను డాక్టర్ చదివించాల్నని మీ నాయన డొనేషన్ కట్టిండు. నీ హాస్టల్ ఖర్చులు నువ్వు అమెరికా ప్రయాణం ఖర్చులు ఎన్నయినవో ఎరికేన నీకు? పెండ్లి అయింది నీకు. పిల్లలయ్యిండ్రు. అమెరికాలోనే వున్నవ్! గిక్కడ మేం తింటన్నమ పస్తులుంటున్నమ పట్టిచ్చుకోలేదు. ఆడపిల్లల పెండ్లిల్లు అయినయి. కరువు కాటకాలు దాటేసినం. అయిన నువ్వు ఒక్కనాడు మేమెట్లున్నమని పట్టిచ్చుకోలేదు! అక్కడ సర్జన్ అయి బాగ సంపాయిస్తున్నవని విన్నం. పెద్ద మేడ కట్టినవని తెలిసింది. పేరుపోయిన డాక్టరువని అంత విన్నం. మరి నువ్వు గిక్కడ గీ సంసారానికి ఏం

జేసినవురా? – మీకేం తక్కువ... మీ కొడుకు పెద్ద డాక్టరు. అమెరికల శాన సంపాయిస్తుండు అని మమ్ముల్ని మొకం పట్టుకొని నలుగురు అంటె సంబరపడి ఊరుకున్నం! మా కష్టాలు బాధలు గురించి నువ్వెన్నడైన తెలుసుకున్నవ? మీ నాయన కాలం జేస్తె చితికి నిప్పుపెట్టేటందుకు వచ్చినవ? రాలేదు. తండ్రికి పెద్దకొడుకు నిప్పు పెట్టాల్నని అంటుంది లోకం. నువ్వు ఆ ధర్మమైన ఆచరించినవ? నువ్వు తండ్రి తల్లి రుణం ఏ విధంగనైన తీర్చుకున్నవ? అంతా... దినాలు సుత అయిపోయినంక ఇయ్యాల వచ్చి... అదీ... రెండు రోజులకోసం ఊరికొచ్చి నాపాలు నాకు పంచి ఇయ్యంండ్రి అమ్ముకొని పోతనంట అంటున్నవ్! నువ్వు పైసలు పంపితే సంసారం మునుపటి లెక్క అయితదని రంధితోటి ఎదిరి చూసిండు మీ నాయన. కాని ఒక్కనాడు నోరు విప్పి నిన్ను అడగలేదు. నువ్వే బాధ్యత ఎరిగి పంపుతవని కండల్ల ఒత్తులేసుకొని చూసిండు. గిప్పుడు నా పాలు నాకు ఇయ్యంండ్రి అని అడిగేటందుకు వచ్చినవ్! పాలోళ్ళకు అమ్ముతనని మాట్లాడినవని కూడ ఎరుకైంది. ఎంత నీచానికి ఒడిగట్టినవురా? ఎంతకో అంతకు అమ్మిపొయ్యేటందుకు తయారైనవ్!... అయిన... నీకు పాలు ఎక్కడుందిరా! నువ్వు ఎవరి బిడ్డవురా! నువ్వు మాకు పుట్టనే లేదు అని నేనంటె ఏం జేస్తవురా! నా పాలే చీకలేదు నువ్వు అంటె ఎవర్ని అడుగుతవురా! నీకు పాలు లేదు యేం లేదు. పో! అమెరికా పో! పేగు తెంచుకొని పోతనని వచ్చినవ్ గద పో! మాతోటి నీకు అంటు సొంటు లేదు పో! పో!..." పెద్దగా అరిచింది రాజేశ్వరి.

ఆమె ఆ విధంగా పెద్దగా మాట్లాడటం ఎవరూ ఇంతవరకు వినలేదు. ఆమె కోపం ఎన్నడూ ఎవరు చూడలేదు. ఈరోజు ఆమె గొంతు విన్న బజారున పోయె వాళ్ళు నలుగురు బంగ్లముందల జమయ్యారు. క్రిష్టారెడ్డి తలవంచుకున్నాడు. అతనికి దుః ఖముప్పొంగింది.

"అమ్మా! తప్పయింది!" అని తల్లి కాళ్ళను కావలించుకొని ఏడ్చాడు.

రాజేశ్వరి అతన్ని దూరంగా నూకేసింది. ఆమె బక్కచిక్కిన శరీరంలో అంతబలం ఎక్కడ్నుంచి వచ్చిందో! రాజేశ్వరి కోపంగా అర్రలోనుంచి బయటికి వెళ్ళిపోయింది.

"అమ్మా!..." అంటూ క్రిష్టారెడ్డి నేలమీద పడిపోయి బోరుమని విలపించాడు.

"పేగు తెంచుకపోవాలనే ఆలోచన యెట్ల వచ్చింది తనకు?... కన్నతల్లిని యెట్ల మరచిపోయిండు తను! పుట్టిన నేల నమ్ముకున్న వాళ్ళు యాదికి లేని కృతఘ్నున్ని..." తలచుకొని తలచుకొని వెక్కి వెక్కి యేడ్చాడు క్రిష్టారెడ్డి. అట్లా ఎంతసేపు నేలమీద పడివున్నాడో తెలియదు. గిరిధర్ వచ్చి

"అన్నయ్యా! లే! గిట్ల ఎంతసేపుంటవు..." అని అతన్ని భుజాల చుట్టు చేతులు వేసి లేపాడు.

"గిరిధర్! తమ్ముడూ! నేను పాలు పంచుకోనురా! నేను ఎప్పుడూ వేరు పడను. నేను భూమిని అసలే అమ్మను. నీకెంత కావాలో చెప్పు పెట్టుబడి నేనిస్త. నన్ను గంజికేంద్రం తీసుకుపోరా! నేనూ ప్రజలందరికీ గంజి పంచుత!"

తమ్ముణ్ని కావిలించుకొని ముందుకు నడిచాడు క్రిష్టారెడ్డి. అతని ముఖంమీద ఆందోళన లేదు. ప్రశాంతత కన్పించింది.

–అప్రచురితం, *2009*